



# మున్సిపాలిటీలో ప్రక్షాళన ప్రారంభం

**- ఆక్రమణలు తొలగించి మురుగుకాలువల్లో పూడిక తీత**

సూళ్లూరుపేట, మార్చి 5 ప్రభాతవార్త: సూళ్లూరుపేట మున్సిపాలిటీలో ఆక్రమణలు తొలగించి గత కొన్నేళ్లుగా ఆక్రమణల కింద పూడిపోయి ఉన్న డ్రైనేజిల్లో మురికితీత కార్యక్రమానికి మున్సిపల్ అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పట్టణ నడిబొడ్డులోని ఆర్అండ్బి రోడ్డుకు తూర్పువైపు యథేచ్ఛగా ఉన్న ఆక్రమణలను తొలగించడంతో పాటు వాటి కింద ఉన్న మురికి కాలువల్లోని పూడిక తీసే కార్యక్రమాన్ని చేపట్టారు. గత ఎన్నో సంవత్సరాలుగా ఈ ఆక్రమణల తొలగింపు జరగకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా డ్రైనేజిలో నీరు కదలకపోవడంతో అటు ప్రజలకు ఇబ్బందులతో పాటు రోడ్లు కూడా ధ్వంసమయ్యే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. గత రెండురోజులుగా కాలువల్లో పూడిక తీత కార్యక్రమాన్ని కార్మికులు, జెసిబిల సహాయంతో ముమ్మరంగా చేపట్టారు. ఈ చర్యలపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోడ్డుకు పడమర వైపు కూడా ఇదే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. హోలీక్రాస్ జంక్షన్ నుంచి అయ్యప్ప గుడి వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజిని శుభ్రం చేస్తే ప్రస్తుతం నూతనంగా వేసిన బిటి రోడ్డు దెబ్బతినకుండా మరింతకాలం ప్రజలకు అనువుగా



ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయని అంటున్నారు. కేవలం మున్సిపల్ అధికారులు మాత్రమే కాకుండా ఆర్అండ్బి అధికారులు ఇందుకు సహకరిస్తే సూళ్లూరుపేట పట్టణంలో గత కొంతకాలంగా నెలకొని ఉన్న ఆక్రమణల సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

# అక్షరాస్యత రేటు, లింగ నిష్పత్తి నిర్ధారణ జన గణనతోనే

**-ప్రతి ఇంటి నుండి సమాచారం గౌరవంగా స్వీకరించాలి**
**-జనగణన డైరెక్టర్ నివాస్**



జన గణన ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న డైరెక్టర్ కె.నివాస్

తిరుపతి,మార్చి 5ప్రభాతవార్త: అక్షరాస్యత రేటు, లింగ నిష్పత్తి జనాభా సంఖ్య వంటి కీలక అంశాలు జన గణన ఆధారంగానే నిర్ణయించబడతాయని, ప్రతి ఎన్యూమరేటర్ సేకరించే సమాచారం ఎంతో విలువైనదని జనగణన డైరెక్టర్ కె.నివాస్ చెప్పారు. ప్రతి దశలోనూ దేశ ప్రణాళికలు రూపొందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సమాజంలోని ప్రతి వర్గం యొక్క నిజమైన జనాభా వివరాలు తెలిసినప్పుడే సరైన ప్రాతినిధ్యం, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం సాధ్యమవుతుందని వివరించారు. జనగణన కార్యక్రమాన్ని ప్రతి ఎన్యూమరేటర్ బాధ్యతగా తీసుకొని, ప్రతి ఒక వ్యక్తిని ఖచ్చితంగా లెక్కించాలన్నారు. ఈ ప్రక్రియను నిజమైన దేశనిర్మాణం ప్రక్రియగా భావించి అందరూ సహకరించి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం ఉదయం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రకాశం భవన్ లో మొదటి దశగృహాల జాబితా, గృహ వసతుల గణన శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ మాట్లాడుతూ జన గణన సమయంలో ముఖ్యమైన అంశం ప్రజల నమ్మకమని, ప్రతి ఇంటి వద్దకు వెళ్లే సమయంలో వారు చెప్పే సమాచారాన్ని గౌరవంగా స్వీకరించాలని సూచించారు. వారి వ్యక్తిగత వివరాలు ఎటువంటి ఇతర ప్రయోజనాలకు ఉపయోగించబడవని వారికి స్పష్టంగా తెలియజేయాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారు చెప్పిన సమాచారాన్ని నిజాయితీగా నమోదు చేసి స్థానిక ప్రజాప్రతినిధులు ,ప్రముఖుల సహకారం కూడా తీసుకుంటే మంచి డేటా సేకరించడం సులభం అవుతుందన్నారు. జన గణన చేపట్టనున్న ప్రాంతాలలో ముందుగానే సమాచారం ఇవ్వాలని వాట్సాప్ గ్రూపులు వంటి ఆధునిక సమాచారం పంచుకునే మార్గాలను ఉపయోగించి, ఏ రోజు , ఏ సమయానికి మీరు వారి ప్రాంతానికి వస్తున్నారో ముందుగా తెలియజేస్తే ప్రజలు అందుబాటులో ఉంటారని అన్నారు. తద్వారా ప్రతి వ్యక్తిని జనగణనలో నమోదు చేయవచ్చన్నారు. ఎన్యూమరేటర్ లు, సూపర్వైజర్ లు క్షేత్ర స్థాయిలో చేసే పనిని చార్జ్ ఆఫీసర్లు సమర్థవంతంగా పర్యవేక్షి ంచాలని, వారిపై అనవసర ఒత్తిడి లేకుండా, సానుకూలంగా ప్రోత్స హిస్తూ పనిచేయిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ శిక్షణ నిర్వహణ ద్వారా మీరు అందరూ జన గణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగలరనే నమ్మకం ఏర్పడిందని ,తిరుపతి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పూర్తిగా సమన్వయంతో, ఎటువంటి తప్పులు లేకుండా విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డిఆర్ఓ నరసింహులు, తిరుపతి, సూళ్ళూరుపేట ఆర్డీఓలు రామ్మోహన్, దేవేంద్ర రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తాసిల్దారులు , ఎం.పి.డి.ఓ లు, జనగణన బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గంగ గల, గలా... చెరువులు కళ కళా!

**-రెండోపంటకు సన్నాహాలు చేస్తున్న రైతన్నలు**



కాలువ నిండా ప్రవహిస్తున్న తెలుగుగంగ నీరు

తొట్టంబేడు,మార్చి 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు, సత్యవేడులోని కెవిబిపురం, బుచ్చినాయుడుకండ్రిగ,వరదయ్యపాళెం,సత్యవేడు మండలాలకు కామధేనుగా తెలుగుగంగ ఉంది. నిప్పులు చెరిగే ఎండలో కూడా తెలుగుగంగ నిండుగా పారుతుంది. దాంతో ఈ ప్రాంతాల్లోని రైతులు ఆనందోత్సాహాలతో ముందస్తు ఖరీఫ్ పంటలను పండించుకుంటున్నారు. 2004-2009లో ఉన్న శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు మూడు మండలాల్లో రైతులకు గంగ నీరు ఉపయోగపడేటట్లు ప్రతి చెరువుకు లింకు ఇచ్చారు. అలాగే రైతులు ఉపయోగించుకునేటట్లు లిఫ్ట్ అవకాశం కల్పించారు. సుమారు వంద చెరువులకు నీరు అందుతుంది. దాంతో రైతులు ఆనందోత్సాహాలతో వ్యవసాయం చేసుకుంటున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం, సత్యవేడు నియోజకవర్గంలోని బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు నియోజకవర్గాల్లోని సుమారు వంద చెరువులకు పైగా తెలుగుగంగ నీటిని నింపుకోవడానికి పంట కాలువలను ఏర్పాటు చేసారు. రబీ సీజన్‌లో వరి పంటను పండించే రైతులు తరువాత ముందస్తు ఖరీఫ్‌లో వాణిజ్యపంటలను పండించుకుంటున్నారు. వేసవి కాలం తమిళనాడులోని చెన్నైకు మంచినీటిని అందించుటకు తెలుగుగంగను కండలేరు నుంచి నీటిని విడుదల చేస్తారు. ఈ నేపథ్యంలోనే శ్రీకాళహస్తికి 0.75 తిరుపతి మంచినీటి అవసరాలకు ఒక టిఎంసినీటిని కేటాయించారు. ఇటు శ్రీకాళహస్తి తిరుపతి దాహార్తిని తీరుస్తుంది. తెలుగుగంగ నీటితో తిరుపతి జిల్లాలోని సుమారు 3.75లక్షల ఎకరాలకు సాగునీరందించుటకు పథకాన్ని ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు.

**1300 క్యూసెక్కుల నీరు విడుదల :**

శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి ప్రవహిస్తున్న తెలుగుగంగ అన్నదాతల పాలి కల్పతరువు అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కండలేరుజలాశయంలో సమృద్ధిగా నీరుంది. దాంతో అధికారులు వేసవిని దృష్టిలో ఉంచుకొని కాలువలో 1300 క్యూసెక్కు నీటిని విడుదల చేసినట్లు సమాచారం. ఇక కాలువ ఎడమ పక్కన చెరువులు నీటితో కళ కళ లాడుతున్నాయి. వేసవిలో కూడా చెరువులు కళ కళ లాడుతున్నాయంటే తెలుగుగంగ పుణ్యమే అని చెప్పవచ్చు. ఇక చెరువుల నుంచి నీటిన కాలువల ద్వారా పంట పొలాలకు తరలించుకుంటున్నారు. తెలుగుగంగ నుంచి డైరెక్టర్‌గా పంట పొలాలలకు మోటార్లు పెట్టి నీటినిమళ్ళించు కుంటున్నారు. ఈ ప్రాంతాల్లో సుమారు 30వేల ఎకరాల్లో పంటలను పండించుకుంటున్నారు.

# పేద ప్రజల అభివృద్ధిలో ... బ్యాంకర్లు భాగస్వామ్యం

**- అర్హత వున్న ప్రతి ఒక్కరికి విరివిగా రుణం మంజూరు**
**- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్**



రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, మార్చి 5 ప్రభాతవార్త: పేద ప్రజల అభివృద్ధిలో బ్యాంకర్లు భాగ స్వాములు కావాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపు నిచ్చారు. కలెక్టరేట్ లోని నాగార్జున ఐఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో డిఎల్ఆర్‌సి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకమని ఆ దిశగా బ్యాంకర్లు విధులు నిర్వర్తించాలన్నారు. రైతులకు పంట పెట్టుబడికి అవసరమైన పంట రుణాలు, షార్ట్ టర్మ్ క్రాప్ ప్రొడక్షన్ రుణాల మంజూరులో ప్రతి బ్యాంకుకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పంట పెట్టుబడి సాయం కోసం రైతులు ఇబ్బంది పడకుండా అవసరమైన రుణాలు మంజూరు చేయడానికి బ్యాంకర్లు శ్రద్ధ వహించాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల ద్వారా మేలు జరిగేలా అర్హులైన లబ్దిదారులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. అలాగే పిఎం స్వనిధి, పిఎం సురక్ష బీమా యోజన, పిఎం జీవనజ్యోతి బీమా యోజన లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ప్రతి బ్యాంకుకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అలాగే జిల్లాలో బ్యాంకుల శాఖలు పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులను కలెక్టర్ కోరారు. ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకు, ఎటిఎం వ్యవస్థను మరింత పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ప్రస్తుతం వున్న సెక్యూరిటీ వ్యవస్థలో ఏదైనా లోపాలు వుంటే వాటిని సరి చేయాల్సిన అవసరం వుందన్నారు. బ్యాంకుల్లో అలారం, సెన్సార్లు సమర్థవంతంగా పని చేయడానికి పరికరాలను సరికొత్తగా మార్చడం, సాంకేతికతను మెరుగుపరచడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాలను కట్టడి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే జాతీయ రహదారుల్లో వున్న ఎటిఎంల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసుకోవడంతో పాటు పక్కాగా సిసి కెమెరాలు అమర్చుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ హరీష్, ఆర్‌బిఐ ఎల్డీఓ రోహిత్, నాబార్డు డిడిఎం సునీల్, కన్వీనర్ ఇందిరా, వివిధ బ్యాంకుల అధికారులు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, జడ్పీ సిఇఓ రవికుమార్, డిఆర్‌డిఏ పిడి శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**రూ.16,037 కోట్లతో రుణ ప్రణాళిక : కలెక్టర్**

2026-27 ఆర్థిక సంవత్సరానికి 16,037 కోట్లతో రుణ ప్రణాళిక సిద్ధం చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. నాబార్డు రూపొందించిన 2026- 27 రుణ ప్రణాళికలను కలెక్టర్ సుమిత్‌కుమార్ బ్యాంకర్ల సమావేశంలో బ్యాంకర్ల సమక్షంలో ఆవిష్కరించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానినికి సంబంధించి రంగాల వారీగా రుణ లక్ష్యాలను రుణ ప్రణాళికలో పొందుపరిచారు. ప్రాధాన్యత రంగాలకు మొత్తం రూ.16,03,764.16కోట్లతో రుణ ప్రణాళిక రూపొందించారు. ఇందులో వ్యవసాయంకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పార్మ్ క్రెడిట్ కిందరూ.9,41,096.92లక్షలు కేటాయించారు.

# యువకుడు ఆత్మహత్య!



చంద్రగిరి, మార్చి 5 ప్రభాతవార్త: మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో బీటెక్ చదువుతున్న యువుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం కడప జిల్లా, బాలపల్లి గ్రామం పాపాసాహెబ్‌పేటకు చెందిన రామానుజరెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి రంగంపేట సమీపంలోని విశ్వవిద్యాలయంలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. విశ్వవిద్యాలయానికి సమీపంలోగల రామిరెడ్డిపల్లి గ్రామంలో గృహాన్ని అద్దెకు తీసుకుని తోటి స్నేహితులతో కలిసి చదువుకుంటున్నాడు. గురువారం సాయంత్రి తన గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతూ ఉండడాన్ని స్నేహితులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చెరుకున్న పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, శవపరీక్ష నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియవలసి వుందని పోలీసులు తెలిపారు.

**ఉన్నత విద్యతో... ఉన్నత శిఖరాలు**

# మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం

**పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ధైర్య స్పర్శ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి**






సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుషార్ -అధ్యాపకులకు హెల్మెట్ పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి

గంగవరం,మార్చి 5 ప్రభాతవార్త : జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశించారు. గురువారం చిత్తూరు జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక మదర్‌థెరిసా కళాశాలలో ఏర్పాటు చేసిన ధైర్య స్పర్శ కార్యక్రమంపై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత జీవనం కోసం యువతను విద్యార్థులకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. సమాజంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో మాదకద్రవ్యాల దుర్వినియోగం,వ్యక్తి గతంగా కాకుండా కుటుంబం, సమాజం ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుందని, దానివల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికి సమగ్ర అవగాహన అవసరమన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా నైతిక విలువలను పాటించి సరైన జీవన శైలిని అలవర్చుకుని ఉజ్వలభవిషత్తుకు బాటలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. విద్య ద్వారా ప్రగతిని సాద్ధించి ప్రతి ఒక్కరు తమ గ్రామానికి తల్లిదండ్రులకు విద్యా సంస్థలకు,సమాజానికి రుణం తీర్చుకోవడానికి ప్రథమిక కర్తవ్యం బాధ్యతగా భావించాలని ఆయన కోరారు. విద్యార్థులందరూ తాము ఎంచుకున్న రంగాలలో ఉన్నత శికరాలను అధిరోహించాలని సూచించారు. చదువుకున్న మాతృ సంస్థకు వన్య తీసుకువచ్చే దేశానికి రేపటి ఆనిముత్యాలు మీరేనన్నారు. సైబర్ నేరాల పై అప్రమత్తత,ఆవగాహనతో నేరాలను అరికట్టవచ్చని, బయమే పెట్టుబడిగా సాగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్టవేయడానికి సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ఏ బ్యాంకు ఉద్యోగి కూడా ఖాతాదారుడికి ఫోన్ చేసి వ్యక్తి గత వివరాలు ఏటిఎం,ఒటిపి,పిన్ వివరాలు అడగరన్నారు.

**హెల్మెట్‌తో... ప్రాణ రక్షణ :**

ద్విచక్రవాహన దారులు హెల్మెట్ వాడకంతో ప్రమాదాల నుండి ప్రధాన రక్షణ కలుగుతుందని ఆయన తెలిపారు. నేటి యువత రోడ్డు నిభవదనలను తప్పక పాటించాలని తెలిపారు. ప్రతి పౌరుడు తన భద్రతకు ట్రాఫిక్ నిభందనలు పాటించి క్షేమంగా వెళుతున్నా అవతలి వ్యక్తులు ర్యాష్ డ్రైవింట్,మద్యం సేవించి నిర్లక్ష్యంతో ట్రాఫిక్ నిభందనలు ఉల్లంగించి అమాయకులను ప్రమాదాలకు గురిచేస్తున్నారన్నారు. ప్రమాదాలలో హెల్మెట్ దరించకపోవడంతో తలకు తీవ్రగాయాలై అధిక సంఖ్యలో ప్రజలు మృత్యవాతపడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు తప్పని సరి హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ తరుణ్ పహ్వా,పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్,గంగవరం అర్బన్ సిఐ రాంభూపాల్,ఎస్బీ సిఐ మురళీమోహన్,కళాశాల కరస్పాండెండెంట్ రవేంద్ర బాబు,చైర్మన్ సునీల్,డైరెక్టర్ రాజేంద్ర రెడ్డి,పలమనేరు నియోజకవర్గ ఎస్ఐలు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కన్నెర్రతో గృహనిర్మాణ సంస్థలో విచారణ

# పది నెలల విచారణలో... ఒరిగింది ఏమి లేదు



వరదయ్యపాలెం, మార్చి 5 ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గృహనిర్మాణ సంస్థపై వరదయ్యపాలెం మండల కార్యాలయంలో ప్రత్యేక విచారణ జరిగింది. ఈ విచారణకు జిల్లా స్థాయి అధికారులు హాజరై పలు అంశాలపై వివరణ ఇచ్చారు. అయితే అర్జీదారు అడిగిన ప్రశ్నలకు అధికారులు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో అక్కడే చర్చ తీవ్రంగా సాగింది. మండలంలో ఇల్లు లేని అనేక మంది లబ్ధిదారులు సంవత్సరాలుగా గృహాల కోసం ఎదురు చూస్తుండగా, ఇప్పటికే ఇళ్లు ఉన్న కొందరికే మళ్లీ ఇళ్లు మంజూరు చేయడంపై అర్జీదారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులను ప్రశ్నించినప్పటికీ స్పష్టమైన సమాధానం రాకపోవడం గమనార్హం. అంతేకాకుండా కొన్ని చోట్ల ఇళ్లు పూర్తిగా నిర్మించకుండానే బిల్లులు చెల్లించినట్లు ఆరోపణలు రావడంతో విచారణలో ఆ అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. దీనిపై అధికారులు తగిన వివరాలు సేకరించి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా ఈ సమస్యపై దాదాపు 10 నెలలుగా విచారణ కొనసాగుతున్నప్పటికీ ఇప్పటికీ తుది నిర్ణయం రాకపోవడం పట్ల అర్జీదారు అసహనం వ్యక్తం చేశారు. పేదలకు న్యాయం జరిగేలా త్వరగా విచారణ పూర్తిచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గృహ పథకాల అమలులో పారదర్శకత ఉండాలని, నిజంగా అర్హులైన వారికి మాత్రమే ఇళ్లు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారన్నారు. జిల్లాలో గృహ పథకాల అమలుపై ఈ విచారణ కీలకంగా మారింది. ఈ విచారణ కార్యక్రమంలో దరఖాస్తు దారు ఆడిపూడి ఆషా,తిరుపతి జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనం శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరి, పూర్వపు ఏ ఈ హేమంత్, పి అర్ డి ఈ గోపాల్, వర్క్ ఇన్స్పెక్టర్ యుగంధర్, పూర్వపు ఇంజనీరింగ్ అసిస్టెంట్ కార్తిక్ హాజరు కాగా, స్థానిక ఏఈ గోపినాథ్ సెలవుపై ఉన్నారు.

# ఇఓగా వెంకటేశు బాధ్యతల స్వీకరణ

**పది రోజుల పాటు సాగిన సస్పెన్షన్‌కు తెర!**



బాధ్యతలు స్వీకరిస్తున్న ఇఓ

శ్రీకాళహస్తి, మార్చి 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారిగా బికె.వెంకటేశు గురువారం ఉదయం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు సంతకం చేసారు. ఇక్కడ సుమారు 15 నెలల పాటు పని చేసిన బాపిరెడ్డిని అమరావతికి బదిలి చేసారు. ఆయన స్థానంలో కడపజిల్లా ముద్దనూరులోని గాలేరు నగరి సుజల స్రవంతిలో పని చేస్తున్న స్పెషల్ డెప్యూటి కలెక్టర్ బికె.వెంకటేశును నియమించారు. పది రోజుల పాటు సాగిన సస్పెన్షన్‌కు గురువారం తెర పడింది. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశు అనంతపురం జిల్లాకు చెందిన వారు. ఆయన కలెక్టరేట్‌లో అలాగే కర్నూలు ఆర్‌డిఓగా పని చేసారు. అలాగే పొట్టి శ్రీరాములు జిల్లాలోని నెల్లూరు, ఆత్మకూరు తహాశీల్దార్‌గా పని చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓగా బాధ్యతలు చేపట్టిన ఇఓలు అందరూ సాధారణంగా పరిపాలన భవనంలోని ఇఓ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించే వారు. అయితే ఆ సంప్రదాయానికి స్వస్తి చెప్పి ఇఓ వెంకటేశు, గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద బాధ్యతలు స్వీకరిస్తామంటూ సూచించారు. దాంతో డెప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ప్రొటోకాల్ ఎఇఓ మోహన్ అక్కడే పైలు సిద్ధం చేసారు. ఆయన స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వెంటనే అక్కడ బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు సంతకం చేసారు.

**కొత్త ఇఓకు ఘనస్వాగతం:**

శ్రీకాళహస్తీశ్వరాలయ ఇఓగా నియమించిన బికె వెంకటేశు బుధవారం రాత్రే శ్రీకాళహస్తిచేరుకున్నారు. గురువారం ఉదయం ఆలయం వద్దకు కుటుంబ సభ్యులతో రాగా ఆయన దక్షిణ గోపురం వద్ద ఘనస్వాగతం పలికారు. డెప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ప్రొటోకాల్ ఎఇఓ మోహన్ ఎపిఆర్ఓ రవిలు ఆయనకు వేదపండితులచే స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం చేసుకున్న ఆయనకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. గతంలో పని చేసిన ఇఓతో అంటీ ముట్టనట్లు ఉన్న చైర్మెన్ గురువారం కొత్త ఇఓ స్వాగతంలో కీలకంగా కనిసించారు. ఆయనకు కండువాతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్‌తోపాటు బోర్డు సభ్యులు నాగరాజు, దండి రాఘవయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ పోరోహితులు అర్ధగిరి స్వామి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఎఇఓలు మోహన్, ఎఇఓలు లోకేష్‌రెడ్డి, హేమామాలిని, సూపరింటెండెంట్ రవి, ఆలయ పర్యవేక్షకుడు నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు వెంకటస్వామి, సుదర్శనం నాయుడు, పోటు నిర్వాహకుడు హరియాదవ్‌లు పాల్గొన్నారు.

## భూఆక్రమణపై దళిత సంఘాల రిలే దీక్ష



**కుప్పం, మార్చి 5 ప్రభాతవార్త:** రామకుప్పం మండలం బందార్లపల్లి వద్ద ప్రభుత్వ భూమి ఆక్రమణపై కుప్పంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారతీయ అంబేద కర్ సేన, బహుజనసేన, ప్రజా సం ఘాల అధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. బందార్లపల్లి వద్ద సర్వే నెం 577/7లో 1.10ఎకరాల భూమిని గతంలో బాలుర హాస్టల్ కోసం ప్రభుత్వం కేటాయించగా ప్రస్తుతం కొందరు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టడంపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా, స్థానిక అధికారులకు ఫిర్యాదుచేసినా మార్పు రాలేదన్నారు. అనంతరం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ దీక్ష శిబిరం వద్దకు చేరుకుని సెక్షన్ 30అమలులో ఉందని దీక్ష విరమించుకోవాలని తెలిపారు.

## పకడ్బందీగా భూముల రీసర్వే



**కుప్పం, మార్చి 5 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేను పక డ్బందీగా చేపట్టేందుకు చర్యలు చేపట్టినట్లు తహశీల్దార్ చిట్టిబాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని యానాదిపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వే కార్యక్ర మంను ఆయన పరిశీలించారు. రైతుల పొలాల హద్దులను నిర్దిష్టంగా గుర్తించి సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ముందుగానే రైతులకు రీసర్వే నోటీసులు అందజేయడంతో పాటు రైతుల సమక్షంలోనే వారి భూములను పకా గా రీ సర్వే చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, స్థానిక నేత మహేంద్ర, విఆర్వో మదన్, రైతులు పాల్గొన్నారు.

## సిఎం చొరవతో ఇండస్ట్రియల్ హబ్‌గా కుప్పం

– ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్



**కుప్పం, మార్చి 5 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబు నాయుడు చొరవతో కుప్పం ప్రాంతం ఇండస్ట్రియల్ హబ్‌గా మారుతోందని ఎపిఐఐసి డైరెక్టర్ మల్లానూరు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం కుప్పం మండలం లోని గుడ్లనాయనపల్లి, చందం పంచాయతీల్లో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను ఆయ న స్థానిక నేతలతో కలసి పరిశీలించారు. ఈస ందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సిఎం చంద్ర బాబునాయుడు కృషితో కుప్పానికి 21 పరిశ్రమలు వచా ్చయన్నారు. రోడ్లు, నీటి వసతి, విద్యుత్ వసతి కల్పించడం జరుగుతోంద న్నారు. మున్ముందు మరిన్ని పరి శ్రమలు కుప్పం వచ్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

## దివ్యాంగులకు అవకాశాలు కల్పించడం బాధ్యత

– కేంద్ర దివ్యాంగ సాధికారత కమీషనర్ గోవిందరాజ్



కుప్పం, మార్చి 5 ప్రభాతవార్త: సమాజంలో ఉన్న దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వశాఖ వికలాంగుల సాధికార విభాగం కమీషనర్ గోవిందరాజ్ సూచించారు. కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ (అటానమస్)లో ఇంటర్నల్ క్వాలీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యుఎసి) అధ్వర్యంలో దివ్యాంగుల దత ్తత, ప్రాప్యత అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈసదస్సుకు గోవిందరాజ్ హాజరై ప్రసంగించారు. ప్రభుత్వ, విదా ్య సంస్థలు, సమాజం కలసి దివ్యాంగులకు అనుకూలమైన వాతావరణం సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయుడు జగన్నాథన్ మాట్లాడుతూ దివ్యాంగుల సాధికారత కోసం అవగాహన పెరగాల్సి ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ దివ్యాంగులకు సాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, స్పందన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలి



**శాంతిపురం/రామకుప్పం, మార్చి 5 ప్రభాతవార్త:** విద్యార్థులు చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలని రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ సూచించారు. గురువారం కడపల్లి కెజిబివి స్కూల్, మిట్టపల్లి బిఆర్ అంబేద్కర్ గురుకులంలో ఆయన విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ధైర్య స్పర్శపై వివరించారు. విద్యపై మక్కువ చూపాలన్నారు. అలాగే క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు సెల్‌ఫోన్లను మితంగావాడితే ఎంతో మంచిదని సూచించారు. నైతిక విలువలపై అవగాహన పెంచుకోవడం పాటు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేష్, వెంకటమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు అడిగి తెలుసుకోవాలి

– టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్



**శాంతిపురం, మార్చి 5 ప్రభాతవార్త:** సిఎం చంద్రబా బునాయుడు ఆదేశాలతో కుటుంబ సాధికార సభ్యులు గ్రామాల్లో తమకు కేటాయించిన కుటుంబాల సమస్యలు తెలుసుకుని పరిష్కారంకు చొరవ చూపాలని టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పలువురు నేతలతో ఆయన సమావేశమై కెఎస్ఎస్‌ల కార్యక్రమంపై సమీక్షించారు. ఈ కార్యక్రమంను మండలంలో త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలు, సమస్యలు తెలుసుకోవాలన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగేలా చూడాలన్నారు. సమావేశంలో కార్మిక సంక్షేమ బోర్డు సభ్యుడు విశ్వనాథనా యుడు, సర్పంచ్ జనార్ధనరెడ్డి, నేతలు మణి, చంద్ర, మంజునాథ్, బాలు పాల్గొన్నారు.

# రైల్వే కోడూరు డివిజన్

## వైసీపి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడిగా సహదేవరెడ్డి



**రైల్వేకోడూరు,మార్చి 5 ప్రభాతవార్త:** రైల్వేకోడూరు వైసీపి ఎన్నికల పరిశీలకులుగా సహదేవరెడ్డిని నియమించినట్లు వైసీపి వర్గాలు తెలిపాయి. రైల్వే కోడూరు వైసీపి రానున్న ఎన్నికల విభాగంలో ఎన్నికల పరిశీలలుగా క్యాడర్ను చక్కగా నిలబెట్టి వైసీపి పార్టీని బలోపేతం చేసే అంతవరకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. తనకు ఈ పదవి సహకరించి నందుకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలను తెలియ జేస్తున్నట్లు సహదేవరెడ్డి తెలియజేశారు. ప్రతి ఒక్క వైసీపీ కార్యకర్తకు అండగా ఉంటూనియోజకవర్గంలోవైసీపీ జెండాను తిరిగి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని తెలియజేశారు.

## నిరుద్యోగులకు జాబ్ మేళా



**రైల్వేకోడూరు, మార్చి 5 ప్రభాతవార్త :** రైల్వే కోడూరు పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఇటీవల కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో కృషి చేస్తున్నారని రూపానంద రెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ముక్కా రూపానందరెడ్డి ఆదేశాల మేరకు జాబ్ మేళాను నిర్వహించడం జరిగిందని ముత్యాల పెంచలయ్య తెలిపారు. వారు మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లా కిందకి రావడం వల్ల భవిష్యత్తులో యువతీ యువకులకు విద్యారంగంలో మరియు ఉద్యోగ రంగంలో మెరుగైన సౌకర్యాలు నియోజకవర్గ యువతీ యువకులకు పొందుతున్నారని అన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర సెక్రటరీ తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి అభివృద్ధి సంస్థ ద్వారా జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభించాలని ఆయన ఆకాంక్షించారు. ఇందులో 227 మంది హాజరు కాక 103 మంది వివిధ కంపెనీలకు ఉద్యోగ అర్హత పొందడం జరిగినట్లు ముత్యాల పెంచలయ్య తెలిపారు.

## సమిష్టి పాఠశాలలో ఇఫ్తార్ విందు



రైల్వేకోడూరు, మార్చి 5 ప్రభాతవార్త: రైల్వేకోడూరు పట్టణంలోని స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న సమిష్టి విద్యాలయంలో పాఠశాల కరస్పాండెంట్ పటాన్ కరిముల్లా ఖాన్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ పటాన్ కరిముల్లాఖాన్ మాట్లాడుతూ రంజాన్ మాస ఉపవాస ప్రక్రియలో భాగంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆయన అన్నారు. పట్టణంలోని ముస్లింలు భారీగా ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్, అమరావతితో పాటు వైఎస్ఆర్ అన్వర్ భాష, అబ్దుల్ ముజీబ్, కరిముల్లా, మెకానిక్ కరాటి మోల తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీకి రూ.15 లక్షలు ఆదాయం

**బంగారుపాళ్యం, మార్చి 5 ప్రభాతవార్త:** బంగారుపాళ్యం గ్రామ పంచాయతీకి వారపు సంత వేలం ద్వారా 15 లక్షల ఆదాయం సమకూరినట్లు సర్పంచ్ ఎంబి ఉమాదేవి కృష్ణమూర్తి చెప్పారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో దినసరి, వారపు సంత భుక్తి హక్కుల వేలం అధికారులు నిర్వహించారు. ఈ వేలం పాట నందు నలుగురు పాల్గొనగా హెచ్చు పాట దారుడుగా సాల్మన్‌రాజు భుక్తి హక్కులు పొందారు. గ్రామ పంచాయతీకి ఈ వేలంతో 15,29,500 రూపాయల ఆదాయం సమకూరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అభివృద్ధి అధికారి రవిచంద్ర, డిప్యూటీ ఎంపిడిఓ పురుషోత్తం, గ్రామ కార్యదర్శి నాయక్, ఉప సర్పంచ్ కామరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామాగ్రి వితరణ



**బంగారుపాళ్యం, మార్చి 5 ప్రభాతవార్త:** మండలంలోని బోడబండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు గురువారం పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు అరిగారిపల్లి సురేష్, శంకర్‌లు విద్యార్థుల కోసం సొంత ఖర్చుతో పరీక్షా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిర్మలా మొగిలీశ్వర్, ఇన్‌ఛార్జీ హెడ్మాస్టర్ గుణశేఖర్, యుటిఎఫ్ నాయకులు మొగిలయ్య, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాముడి ఆలయంలో పూజలు



**పులిచెర్ల, మార్చి 5 ప్రభాతవార్త :** మండల పరిధిలోని దేవళం పేట గ్రామపంచాయతీ మిట్ట మీద రాచపల్లిలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీ హనుమాన్ సీతా లక్ష్మణ సమేత కోదండ రామస్వామి ఆలయంలో గురువారం సాయంకాలం వేద పండితుల మధ్య స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. కోదండ రామస్వామి ఆలయంలో గురువారము భక్తులతో కిటకిటలాడింది ప్రత్యేక కార్యక్రమాలు స్వాములు నిర్వహించారు. ప్రతిరోజు జరిగే కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి వారికి దర్శించు కోవాలని అన్నారు.

## విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



**యర్రావారిపాలెం, మార్చి 5 ప్రభాతవార్త:** విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని యర్రావారిపాలెం ఎస్ఐ విశ్వనాథ్ లోకేష్ తెలిపారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాస్తూరిబా బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని యర్రావారిపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నదన్నారు. పోలీసులు మహిళల భద్రత కోసం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉన్నామని ఎస్ఐ లోకేష్ తెలిపారు.

## ప్రభుత్వ భూముల జోలికి రావొద్దు



**యర్రావారిపాలెం, మార్చి 5 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత అని నెరబైలు వీఆర్వో రవీంద్ర నాయక్ అన్నారు. ప్రభుత్వ భూముల జోలికి రావొద్దంటూ అక్రమార్కులను హెచ్చరించారు. గురువారం యర్రావారి పాలెం తహసీల్దార్ వాసుదేవకుమార్ ఆదేశాలతో నెరబైలు రెవెన్యూ గ్రామంలో వివిధ చోట్ల అక్రమాలకు గురైన ప్రభుత్వ భూమికి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గ్రామంలోని సర్వే నెంబరు 438, 44/3, 1609/4లో ఆక్రమణకు గురైన సర్కార్ భూమిలో హెచ్చరిక బోర్డులు పెట్టారు. తిరిగి ఆక్రమణకు ప్రయత్నిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఆక్రమించే ప్రయత్నం చేసినా, రికార్డులు తారుమారు చేయాలని ప్రయత్నించినా కఠినమైన క్రిమినల్ కేసులు తప్పవని రవీంద్ర నాయక్ హెచ్చరించారు.

## పేదలకు వరం సంజీవని ప్రాజెక్టు

– ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, మార్చి 5 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబు నాయుడు కుప్పంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంజీవని ప్రాజెక్టు (టాటా డిజిటల్ నెర్వ్‌సెంటర్) పేదలకు వరం అని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం మండలంలోని బ్రహ్మదేవర చేన్లు గ్రామంలో సంజీవని ప్రాజెక్టుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో ప్రజల ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేయడంతో పాటు వారికి అత్యవసర వేళల్లో వైద్య నిపుణులచే ఆరోగ్య సేవలు అందించడం జరుగుతుందనా ్నరు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కనీసవేతనాల బోర్డు సభ్యుడు శరవణ, కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, సర్పంచులు రాజే ంద్ర, ధనశేఖర్, నేతలు కనకరాజ్, కుమార్, శివకుమార్, లోకేష్, మునాఫ్, గుణశేఖర్ పాల్గొన్నారు.

## బహిరంగ మద్యసేవనం..కోర్టులో జరిమానా

**శాంతిపురం, మార్చి 5 ప్రభాతవార్త:** మండలంలోని పలు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న పదిమంది వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. న్యాయమూర్తి మొదటితప్పుగా భావించి వారికి వెయ్యి రూపాయల వంతున ప్రతి ఒక్కరికీ జరిమానా విధించారన్నారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడరాదని ఎస్సై సూచించారు.

## విద్యార్థులకు రీడింగ్ ఛైయిర్లు వితరణ



**రామకుప్పం, మార్చి 5 ప్రభాతవార్త:** మండలంలోని ఆనిగా నూరు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు దాతలు రీడింగ్ ఛెయిర్లు, రాత అట్టలను పంపిణీ చేశారు. ఎఇ సుబ్బయ్య, మాజీ సర్పంచ్ రామూర్తి, ఎంపిపి సులోచన గుర్రప్ప, సత్యనారాయణశెట్టి పాతిక వేల విలువ చేసే పరికరాలు అందించారు. విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఇన్‌చార్జ్ ఎంపిడిఓ మురళీధర్‌రెడ్డి, మానిటరింగ్‌కమిటీసభ్యుడుజయశంకర్, ఎస్ఎంసి ఛైర్మన్ బీరప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంకు కృషి చేయాలి

**రామకుప్పం, మార్చి 5 ప్రభాతవార్త:**



గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి కోరారు. స్థానిక శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద నిర్వహించిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పథకాల్లో ప్రజలు లబ్ది పొందేలా చూడాలన్నారు. గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో నేతలు పట్రనారాయణ, కామరాజునాయక్, రామూర్తి, గుర్రప్ప, గంట్లప్పగౌడు, జయశ ంకర్, శంకరాచలం, పెరుమాళ్, మంజునాథరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రఘు, విజయ్‌రెడ్డి, బాలరాజు, ఆదిల్, మంజునాథ్, సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కేవలం చార్జింగ్ తో ఖర్చు లేని ప్రయాణం.

**చిట్వేలి, మార్చి 5, ప్రభాతవార్త:** నిత్య జీవితంలో అందరికీ బైక్ ప్రయాణం అవసరంగా మారిందని, ఈ బైక్ ద్వారా కేవలం చార్జింగ్ తో ఖర్చులేని ప్రయాణం పొందవచ్చని రాజంపేట పార్లమెంటు జిల్లా టిడిపి అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు, నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, కూడా ఛైర్మన్ ముక్కారూపానందరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రక్కన శ్రీ సద్గురు ఎంటర్ప్రైజెస్ వారి ఈ బైక్స్ షోరూంను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వాహనం కోసం వెచ్చించే ఖర్చు కంటే ఇంధనం కోసం చేసే ఖర్చు భారంగా మారుతుందని ఈ బైక్ ద్వారా సామాన్యులకు పొదుపు అవుతుందన్నారు. రానున్న కాలం ఎలక్ట్రానిక్ వాహనాలతో ముడిపడి ఉంటుందని గుర్తు చేశారు. ఈ బైక్ లను మండల ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చిన యువత గోపిదేశి, ప్రసాద్ పిడుగు ప్రసాద్, భాను ప్రకాష్ లను అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు, వైసిపి నాయకులు ఉమామహేశ్వర్ రెడ్డి, చెవ్వు శ్రీనివాసులురెడ్డి, ఎల్వి మోహన్ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు కాకర్ల నాగార్జున, మాజీ అధ్యక్షులు కాకర్ల సుబ్బరాయుడు, టిడిపి నాయకులు గుత్తి నరసింహులు, మాదాసు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## సుగవాసిని సత్కరించిన కాకర్ల.

**చిట్వేలి, మార్చి 5, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబును మండల టిడిపి బాధ్యుడు కాకర్ల నాగార్జున ఘనంగా సత్కరించారు. గురువారం తొలిసారిగా మండలానికి విచ్చేసిన సుగవాసిని తన ఇంటికి ఆహ్వానించారు. పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో మండల పరిధిలోని సమస్యలను సుగవాసికి వివరించారు. పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించాలని కోరగా; కష్టపడ్డ వారికి సరైన న్యాయం చేస్తామని సుగవాసి హామీ ఇచ్చినట్లు కాకర్ల తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు లారీ సుబ్బారాయుడు, బొక్కసం చలపతి, ఆకేపాటి వెంకట రెడ్డి, మద్దిన కోటయ్య నాయుడు, మాచినేని సుబ్బారామయ్య, మించల బాలకృష్ణ యాదవ్, పగడాల వెంకటేష్, బాలు రెడ్డయ్య, బండారు శివప్రసాద్, రాయన సుబ్బారాయుడు, నంద్యాల ధనంజయ, కాకర్ల కోటేశ్వరరావు, తుంగా చంద్రశేఖర్, పగడాల శివ, కట్టా గిరి బాబు, గూడూరు నాగరాజు, మోసాటి సుబ్రహ్మణ్యం, కస్తూరి శివ, రాయపు చంద్రమోళి తదితరులు పాల్గున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మహిళలకు క్రీడా పోటీలు

**చిత్తూరురూరల్, మార్చి 5 ప్రభాతవార్త:** ఈనెల 8వ తేది అంతర్జాతీయ మహిళాదినోత్సవంను పురస్కరించుకొని ఖేలో ఇండియా జిల్లా ప్రాధికారిక సంస్థ భాగస్వామ్యంతో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ మైభారత్ సంయుక్తంగా మహిళలకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్‌భాస్కర్ తెలిపారు. మహిళలలో చైతన్యం, ఆరోగ్యం, శారీరక ధృడత్వం కోసం మహిళలు, బాలికలను మూడు కేటగిరిలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు ముందుగా అస్మిత పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, పాల్గొనేవారికి ప్రత్యేక సర్టిఫికేట్స్, బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మైభారత్ అకౌంట్స్ ఆఫీసరు ఎంసి బాబురెడ్డి, మైభారత్ పెన్సింగ్ ఛాంపియన్ రాఘవ్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత



**చిత్తూరుహెల్త్, మార్చి 5 ప్రభాతవార్త:** మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎఐఎంఎస్ఆర్ అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్ అన్నారు. చిత్తూరు మురకంబట్టు అపోలో యూనివర్సిటీ ప్రాంగణంలోని డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి నాలెడ్జ్‌సెంటర్ ఆడిటోరియంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకుని మహిళల హక్కులు, భద్రతపై విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఐఎంఎస్ఆర్ అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్ మాట్లాడుతూ బాల్య దశ నుండి మహిళా భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన అవసరం వుందన్నారు. మహిళలు ఎక్కడికి వెళ్ళినా చుట్టుప్రక్కల పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా వుండాలన్నారు. కేవలం శారీరక భద్రత మాత్రమే కాకుండా మానసిక భద్రత ముఖ్యమన్నారు. జిల్లా పోలీస్ ట్రైనింగ్ ఎస్ఐ నాగసౌజన్య మాట్లాడుతూ మహిళల భద్రత కోసం పోలీసు శాఖ పలు చర్యలు తీసుకుంటోందన్నారు. ఆపదలో వున్న మహిళలు పోలీసులకు సమాచారం అందిస్తే వారు సత్వరం వచ్చి సహాయం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ హసీనా, ఐసిసి ఛైర్‌పర్సన్ డాక్టర్ హిమబిందు, అధ్యాపకులు, వివిధ విభాగాల విద్యార్థులు హాజరయ్యారు.

## విద్యార్థినికి లాప్‌ట్యాప్ అందజేసిన కలెక్టర్



**చిత్తూరుహెల్త్, మార్చి 5 ప్రభాతవార్త:** యుపిఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్సీ విద్యార్థినికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన లాప్‌ట్యాప్‌లను కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం అందజేశారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ యుపిఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న సదుం మండల విద్యార్థిని వి.లోకేశ్వరికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా లాప్‌ట్యాప్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి విద్య ఏకైన మార్గం అన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో కోచింగ్ పొందడానికి లాప్‌ట్యాప్‌ను అమర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ ఎస్సీ కార్పొరేషన్ ఇడి శ్రీదేవి పాల్గొన్నారు.

## యాదమరి భవిత కేంద్రంకు ఐఓసి చేయూత



**చిత్తూరు, మార్చి 5 ప్రభాతవార్త:** యాదమరిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా యాదమరి భవిత కేంద్రంలోని దివ్యాంగ పిల్లలకు చేయూత అందించింది. యాదమరి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 4 లక్షల రూపాయల విలువైన వీల్ ఛైర్స్, వినికిడి యంత్రాలు, సిపి ఛైర్స్, బుద్ధి మాద్యం వున్న పిల్లలకు కిట్లు, టీచర్ లెర్నింగ్ మెటీరియల్‌ను గురువారం సంస్థ మేనేజర్లు హర్షవర్ధన్, మురళీలు అందజేశారు. సర్వశిక్షాభి యాన్ పిఓ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడానికి ఐఓసి సంస్థ సహకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు మహబూబ్‌భాషా, హెచ్‌ఎల్ఎన్ ప్రసాద్, జిల్లా సహిత విద్య సమన్వయకర్త మధు, పాఠశాల ఇన్‌ఛార్జీ హెడ్మాస్టర్ వెంకటరమణ, భవిత సెంటర్ రిసోర్స్ పర్సన్స్ ఉమ, మహేష్‌లు, పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు.

## డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి!

**చిత్తూరు, మార్చి 5 ప్రభాతవార్త:** కట్టమంచి మ్యాంగో నగర్ సమీపంలోని డ్రైనేజీలో ఓ వ్యక్తి పడి బుధవారం రాత్రి మృతి చెందాడు. డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి చెందడంతో గురువారం తెల్లవారుజాము స్థానికులు టుటౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు పోలీసులు వచ్చి డ్రైనేజీలో పడివున్న అతనిని వెలుపలికి తీసి పరిశీలించగా అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అతని దుస్తుల్లో వున్న గుర్తింపు కార్డుల ఆధారంగా కొన్ని ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోగా మృతి చెందిన వ్యక్తి పేరు హమీద్ అని అతనికి తల్లిదండ్రులు లేరని తెలిసింది. ఇంట్లో ఒంటరిగా వుంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడని బుధవారం ఎక్కువ మద్యం సేవించి అదుపు తప్పి డ్రైనేజీలో పడిపోవడంతో మృతి చెందినట్లు తెలిసింది. టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా స్పూర్తిదాయక సినిమాలు ప్రదర్శన

**చిత్తూరుహెల్త్, మార్చి 5 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకుని గురువారం చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ పోలీసులు పిసిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ర్యాంకర్స్ పాఠశాల్లో మహిళా స్పూర్తిదాయక సినిమాలను విద్యార్థినిలకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మహిళా స్టేషన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సినిమాల ప్రదర్శన ద్వారా విద్యార్థినిల్లో ఆత్మవిశ్వాసంను పెంపొందించడం, మహిళా సాధికారితపై అవగాహన పెంచడం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా స్టేషన్ ఎస్ఐ శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశాలకు ఉద్యోగ భద్రత

– బడ్జెట్ సమావేశాల్లో జీతాలు పెంపుకు చర్యలు



**చిత్తూరు, మార్చి 5 ప్రభాతవార్త:** ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి పనిభారం తగ్గించాలని, బడ్జెట్ సమావేశాల్లో ఆశాల జీతాలు పెంపుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ఎదుట గురువారం ఆశా వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆశా వర్కర్లు పోరాటం చేస్తే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీతాలు పెంచుతామని హామీ ఇచ్చిన ఇపుటి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినా ఇచ్చిన హామీ అమలు చేయలేదని ఆరోపించారు. ధర్నా అనంతరం నాయకులు డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కోదండయ్య, చిత్తూరు జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఉషారాణి, షీబా, లోకేశ్వరీలు, నాయకులు గోపినాథ్, మణి, కోకిల, పవిత్ర, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ఉభయదారుల కమిటీ ఛైర్మన్ మృతి



**కాణిపాకం, మార్చి 5 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానం ఉభయదారుల కమిటీ ఛైర్మన్ కె.ఈశ్వర్‌బాబు అలియాస్ బుజ్జినాయుడు గురువారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈశ్వర్‌బాబు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం క్షీణించడంతో గురువారం ఉదయం ఆస్పత్రిలో కన్నుమూశారు. ఉభయదారుల కమిటీ ఛైర్మన్‌గా గత 15 ఏళ్ళుగా ఉభయదారుల హక్కుల కోసం నిరంతరం పాటుపడుతూ మరో వైపు ఎప్పటికప్పుడు ఆలయ అధికారులకు సూచనలు సలహాలు ఇస్తూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేశారు. ఈశ్వర్‌బాబు మృతి పట్ల ఆలయ ఉభయదారులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈయన బౌతికకాయానికి ఆయన స్వగ్రామం ఐరాల మండలం చిగరపల్లెలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించన్నుట్లు బంధువులు తెలిపారు.

## శాస్త్రసీయ విజ్ఞానంతోనే విద్యార్థులకు భవిష్యత్తు



**చౌడేపల్లి, మార్చి 5 ప్రభాతవార్త :** శాస్త్రీయ విజ్ఞానంతోనే విద్యార్థులకు భవిష్యత్తు వుంటుందని ఎంఇఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మలన్నారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నిత్య జీవితంలో విజ్ఞానం, విచిత్ర వస్త్ర వేషధారణలపై మండలస్థాయి పోటీలు జరిగాయి. వీరు ఈనెల 6న ఉమ్మడి జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. బాబురమేష్, మురళి, రమణ, సుబ్రమణ్యం, ఆనంద్, తేజస్విని, అరుంధతి, పూర్ణిమ, వసంతలు పాల్గొన్నారు.

## పూర్వపు విద్యార్థులచే క్రీడా పతాకాలు బహూకరణ

**చౌడేపల్లి, మార్చి 5 ప్రభాతవార్త:** మండలంలోని పంచాయతీ కేంద్రం చారాల ఉన్నతపాఠశాలలో 1992-93(టెన్త్)చదివిన పూర్వపు విద్యార్థులు క్రీడా పతాకాలను బహూకరించారు. సాధారణంగా క్రీడలు ఆడే సమయంలో పాఠశాల లోని విద్యార్థులను వీటిద్వారా ప్రోత్సహించినట్లు వుంటుందని వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్రబాబు అన్నారు. వారిని ప్రధానోపాధ్యాయురాలు రేణుక సత్కరించారు. ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థి సుబ్రమణ్యంరెడ్డి అతని మిత్రబృందం పాల్గొన్నారు.

## అరణియార్ ప్రాజెక్టులో గుర్తు తెలియని మృతదేహం

నాగలాపురం, మార్చి 5 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం అరణియార్ ప్రాజెక్టు పరిసరాల్లో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం తరలించారు. యువకుడి వివరాలు తెలియాల్సి ఉండగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌ని కలసిన మునిభాస్కర్



**విజయపురం, మార్చి 5 ప్రభాతవార్త:** ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొంకల్ల నారాయణను చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి మునిభాస్కర్‌రాజు గురువారం మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలసి శాలువతో సత్కరించారు. నగరి కనకమ్మసత్రం బస్సును విజయపురం మీదుగా అంతరాయం లేకుండా నడపాలని కోరారు. అనంతరం టీడీపీ జాతీయ కార్యాలయంలో జరిగిన క్లస్టర్ ఇన్‌చార్జి శిక్షణ తరగతులకు హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మణి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## నెల జీతం బోనస్ ఇవ్వాలి: పులి శ్రీకాంత్



**శ్రీకాళహస్తి,మార్చి 5 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగిన మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో బాధ్యతగా విధులు నిర్వహించి పారిశుద్ధ్యం విషయంలో ఎంతో జాగురూకత వహించిన కార్మికులకు ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని జైభీమ్ ఆర్మి ఉద్యోగి పులి శ్రీకాంత్ డిమాండ్ చేసారు. గురువారం ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో పగలు రేయి తేడా లేకుండా పారిశుద్ధ్య కార్మికులు పని చేసారన్నారు.స్వామి అమ్మవార్లు ఊరేగించే నాలుగుమాడా వీధులతో పాటు బాబూ అగ్రహారం ప్రాంతాల్లో కూడా కంటిమీద కునుకు లేకుండా పని చేసారని పారిశుద్ధ్యం విషయంలో ఎంతో జాగ్రతలు తీసుకున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు పారిశుద్ధ్య కార్మికుల జవాబుదారి తనాన్ని గుర్తించి వారికి ఒక నెల జీతాన్ని బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేసారు.

## నూతన కమిటీ ఏకగ్రీవం

తొట్టంబేడు, మార్చి 5 ప్రభాతవార్త:



తొట్టంబేడు మండలం నందు పంచాయితీ అభివృద్ధి అధికారుల సంఘం, నాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పంచాయతీ అభివృద్ధి అధికారుల సంఘం,తొట్టంబేడు మండలం అధ్యక్షునిగా ఎన్ భాస్కర్, ఉపాధ్యక్షురాలుగా కె.శాంతి, శివకృష్ణ ఎన్నికవ్వగా, జనరల్ సెక్రెటరీగా కె.రంజిత బి.వాసు, ట్రెజరర్ గా.. హరిబాబు, సారధి ఎన్నికైనారు వీరిని పలువురు నాయకులు, మరియు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

## బలిజ భవన నిర్మాణం వేగవంతం

**శ్రీకాళహస్తి, మార్చి 5 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో దశాబ్దాల నాటి బలిజ సంఘ నిర్మాణానికి రూపం వస్తుందని మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన అయ్యలనాడు చెరువులో జరుగుతున్న బలిజ భవన నిర్మాణం పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజ సామాజిక వర్గం కలలకు ఇంత కాలానికి రూపం వస్తుందని అభిప్రాయపడ్డారు. 50కి 80 కొలతలతో నిర్మాణం చేపట్టినట్లు వివరించారు.ఈ భవన నిర్మాణాన్ని పరిశీలించిన వారిలో స్వర్ణమూర్తి,కొండుగారి విష్ణుమూర్తి,సిద్దులు గారి శివప్రసాద్,శెట్టిపల్లి సురేష్, నరేంద్ర, గణపతి, మాధవయ్య, పసుపులేటి నాని, సుకుమార్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే పేదరికం దూరం

**శ్రీకాళహస్తిరూరల్,మార్చి 4 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం సామాజిక కార్యకర్త యల్లంపాటి కోటేశ్వరరావు పోటీ పరీక్షల విద్యాసామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు ఒక్కటే పేదరికాన్ని దూరం చేస్తాయని వివరించారు.తొమ్మిదేళ్ళుగా కోటేశ్వరరావు నిరుపేదల విద్యార్థుల సేవలో పాల్గొంటున్నారు. శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 9,10 తరగతుల విద్యార్థులు 246 మందికి విద్యాసామగ్రిని అందించారు.

## శుద్ధ జల యంత్ర భూమి పూజ



**ఏర్పేడు,మార్చి 5 ప్రభాతవార్త:** మండలంలోని గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురా మేశ్వరాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆర్.ఓ వాటర్ పాయింట్ ను ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మెన్ బత్తల గిరినా యుడు తెలిపారు. గురువారం ఇక్కడ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమం పెంచల కోన అధినేత విజయ్ భరత్,విజయ్ గోకుల్,విజయ్ సౌమ్యలు భూమి పూజలు జరిపారు. మంచినీటి కోసం శుద్ధ జల యంత్రాన్ని నిర్వహించుటకు భూమి పూజలు జరిపారు.

## వేలం పాటలు వాయిదా

**శ్రీకాళహస్తి,మార్చి 5 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి మున్సిపాలిటి గురువారం నిర్వహించాల్సిన కొన్ని వేలం పాటలను వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ తెలిపారు.అని వార్యకారణాలతో వేలం పాటలను వాయిదా వేసినట్లు ఆయన వివరించారు. మినీ కూరగాయల మార్కెట్(ఇ సేవా ప్రాంగ ణం) మాంసం మరియు చేపల మార్కెట్టు(ముత్యాలమ్మగుడి) జంతువధ శాల(ముత్యాలమ్మగుడి వీధి)లోని మున్సిపాలిటికి సంబంధించిన వేలం పాటలను వాయిదా వేసినట్లు వివరించారు.ఈ వేలం పాటలను ఈ నెల 13న నిర్వహించబడుతుందని కమిషనర్ వివరించారు.టెండర్‌లో పేర్కొన్న మేరకు డాక్యువమెంట్లును ఈ నెల 12న 4గంటల లోపల సమర్పించి వేలం పాటల్లో పాల్గొనవచ్చునని కమిషనర్ తెలిపారు.

## మసీదు అధ్యక్షునిచే ఇఫ్తార్ విందు

శ్రీకాళహస్తి,మార్చి 5 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి జామియా మస్‌జిద్ ముతవల్లి అక్రమ్‌సాహెబ్ గురువారం ఉపవాస ఐదీక్షలు పాటిస్తున్న ముస్లింలతో పాటు మగరిబ్ నమాజుకు హాజరైన అందరికి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ప్రస్తుతం రంజాన్ మాసం నడుస్తుంది. గురువారం15 ఉపవాసదీక్షలుపూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసారు. గురువారం మస్‌జిద్ ముతవల్లి అక్రమ్ సాహెబ్ ఇఫ్తార్ విందు అందించారు. ఈ కార్యక్రమాల్లో మసీదు ముతవల్లి అక్రమ్ సాహెబ్, తాజుద్దీన్, స్థానికంగా సేవలందించే యువ కమిటి గోరా, తమీమ్, హబీబుల్లా, అమాన్, మహమ్మద్, మీర్జావలి, ఖాదర్‌బాషా, ఉస్మాన్, అల్తాఫ్, సులేమాన్,సర్దార్‌లు సహకరించారు.

## ఈ నెల 12వ తేదీన చేపల చెరువుల వేలం

వరదయ్యపాలెం, మార్చి 5 ప్రభాతవార్త:

మండలం ఈ నెల 12వ తేదీన సంతవేలూరు సచివాలయంలో ఉదయం 10 గంటలకు సర్పంచ్ నందయ్య అధ్యక్షతన డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ సమక్షమంలో సంతవేలూరు చెరువు, సాధనవారిపాలెం(పెరుమాళ్ రాజ్) చెరువులకు చేపల వేలం పాట నిర్వహించ బడును. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనగలరని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

## దేవస్థానం చైర్మన్‌ను కలిసిన త్యాగరాజు

వరదయ్యపాలెం, మార్చి 5 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం చైర్మన్ కొట్టె సాయిప్రసాద్‌ని, దేవాంగ అభ్యుదయ సేవా సంఘం కన్వీనర్ గుత్తి త్యాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించినందుకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియ జేశారు. దేవాంగుల కీర్తి ప్రతిష్ఠకు ప్రతీకలైన నంది–సింహ వాహన సేవలు అద్భుతంగా నిర్వహించినందుకు హర్షం వ్యక్తం చేశారు. దేవాంగ అభ్యుదయ సేవా సంఘం శ్రీకాళహస్తి అసెంబ్లీ ఇంచార్జి మాధన గోపి పాల్గొన్నారు.

## భాకరపేట సీఐగా సత్యనారాయణ

**చిన్నగొట్టిగల్లు, మార్చి 5 ప్రభాతవార్త:** భాకరపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా టీవీ సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు ఆయన తిరుపతి వీఆర్ (వెయిటింగ్ రిజర్వ్) నుంచి బదిలీపై భాకరపేటకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐను బదిలీ చేసి తిరుపతి వీఆర్‌కు పంపినట్లు పోలీస్ శాఖ వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. భాకరపేట పరిధిలో శాంతి భద్రతలు కాపాడడంలో ప్రజల సహకారం అవసరమని సత్యనారాయణ తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీస్‌శాఖ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.

## సుధహ లిటిల్ సిటిజన్స్ హై స్కూల్‌లో 33వ వార్షికోత్సవ వేడుకలు.



**తిరుపతి విద్య మార్చి 5 ప్రభాతవార్త:** తిరుపతి లోని మహతి ఆడిటోరియంలో సుధాహ్ లిటిల్ సిటిజన్స్ హై స్కూల్ యొక్క 33వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య హాజరయ్యారు.ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ చూపాలని, అలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. సుధాహ్ పాఠశాల విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షి ంచారు.పాఠశాల చైర్మన్ డా. కొడూరు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 33 సంవత్సరాలుగా సుధాహ్ లిటిల్ సిటిజన్స్ హై స్కూల్ నాణ్యమైన విద్యను అందిస్తూ మంచి ఫలితాలను సాధిస్తూ వస్తోందని తెలిపారు. పాఠశాల అనుభవం, విద్యా ప్రమాణాలు ఈ కార్యక్రమంలో ప్రతిబింబించాయని అన్నారు. విద్య మాత్రమే కాదు, సమాజానికి విలువలతో కూడిన మంచి పౌరులను తీర్చిదిద్దడం సుధాహ్ ఎడ్యుకేషనల్ గ్రూప్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే పాఠశాల క్రీడా మైదానం భవిష్యత్తులో అనేక మంది క్రీడాకారులను తీర్చిదిద్దే కేంద్రం గా నిలిచి, ఎంతో మంది క్రీడాకారులను దేశానికి అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో పాఠశాల కరస్పాండెంట్ డా. నీలిమ, ఎంఈఓ బాలాజీ, రాష్ట్ర సీనియర్ నాయకుడు సూరా సుధాకర్ రెడ్డి, ప్రజా సమీక్ష పబ్లిషర్ ప్రమోద్ కుమార్, దుర్గా , టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బీజీ కృష్ణ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి పుష్పావతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ సెలక్షన్స్ సద్వినియోగం చేసుకోండి

– 8న అండర్ 23 సీనియర్ మెన్స్ క్రికెట్ జట్లు ఎంపిక



– సిడిసిఏ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసమూర్తి, సతీష్ యాదవ్

**తిరుపతి క్రీడ,మార్చి 5 ప్రభాతవార్త:** ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్చి 8వ తేదీ ఆదివారం జరుగు అండర్ 23, సీనియర్ మెన్స్ క్రికెట్ సెలక్షన్స్ ను ఆసక్తి కలిగిన క్రికెట్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సిడిసిఏ) అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి మందపాటి సతీష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని క్రికెట్ క్రీడాకారుల ప్రతిభను చాటుకునేందుకు ఇదొక గొప్ప అవకాశం అన్నారు. ఈ ఎంపిక ప్రక్రియ తిరుపతి మంగళం రోడ్డులోని కజీరియా టైల్స్ ఎదురుగా ఉన్న సీవీ క్రికెట్ నెట్స్ నందు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు అండర్ 23 మెన్స్, మధ్యాహ్నం 3 గంటలకు సీనియర్ మెన్స్ క్రికెట్ ఎంపిక ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. మరిన్ని వివరాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సతీష్ యాదవ్ 8886185559, కోచ్‌లు సునీల్ కుమార్ 9000214966, చిన్నబాబు 7981880381లను చరవాణి ద్వారా సంప్రదించ వలసిందిగా వారు కోరారు.

## ఫిజియోథెరపీ కళాశాల ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం



**తిరుపతి హెల్త్, మార్చి 5 ప్రభాతవార్త :** శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఫిజియోథెరపి కళాశాల ఆధ్వర్యంలో జెరియాట్రిక్స్ సిపిడి కెరీర్ ఎంపికలు అనే అంశంపై అతిథి ఉపన్యాసంను గురువారం ఉదయం 11.00 గంలకు స్విమ్స్ ఓ.పి.డి. బ్లాక్ శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. యు.కె. నుండి అతిథిగా విచ్చేసిన డా. కిరణ్ కుమార్ జెరియాట్రిక్స్ సిపిడి, కెరీర్ ఎంపికలు అనే అంశంపై ప్రసంగిస్తూ చిన్న పిల్లలకు పిడియాట్రిక్స్ లాగానే వృద్ధులకు ప్రత్యేకంగా వైద్యం అందించేలా పి.జి. మెడికల్‌లో జెరియాట్రిక్స్ స్పెషలైజేషన్ కోర్సును కేంద్ర ప్రభుత్వం అమలు చేసిందని దీనిని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్.ఎం.సి) ఆమోదించిందన్నారు. కాలేజి ఆఫ్ ఫిజియోథెరఫి ప్రిన్సిపల్ డా. కె.మాధవి అతిథిగా విచ్చేసిన డా. కిరణ్ కుమార్‌ని శాలువతో సన్మానించి, మెమెంటోను బహుకరించారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ ఆర్గనైజింగ్ సభ్యులుగా డా. కుమారి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కాలేజి ఆఫ్ ఫిజియోథెరఫి ప్రిన్సిపల్ డా. కె.మాధవి, అసోసియేట్ ప్రొ. డా. విశ్వనాథ్, ప్రోగ్రామ్ ఆర్గనైజర్, అసోసియేట్ ప్రొ. డా. కుమారి, అసిస్టెంట్ ప్రొ.డా.శాంతి, అసిస్టెంట్ ప్రొ.డా సెంధిల్ కుమార్, ట్యూటర్స్ డా. సురేష్ కుమార్, డా. కవిత, డా. కామేశ్వరి, డా. రాఘవరెడ్డి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చంద్రాయుడుకు జాతీయ అవార్డు



**తిరుపతి విద్య మార్చి 5 ప్రభాతవార్త:** ఎస్వీయూ భౌగోళిక విభాగం ఆచార్యులు, సీడీసీ డీన్ ఎన్ చంద్రాయుడును ప్రతిష్టాత్మక భూగోళ్ శాస్త్ర భూషణ్ అవార్డు 2026 అవార్డు వరించింది. ఎస్వీయూలో ఇటీవల జరిగిన 20వ డీజీఎస్ఐ అంతర్జాతీయ సదస్సులో దక్కన్ జియోగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ అవార్డును అందజేసింది. భౌగోళిక బోధన, పరిశోధన, విద్యా ప్రచురణలకు ఆయన చేసిన అద్భుతమైన కృషికి గుర్తింపుగా ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా గురువారం ఎస్వీయూ వీసీ టాటా నర్సింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు.

## ఘనంగా యూత్ పార్లమెంట్ పోటీలు



**తిరుపతి విద్య, మార్చి 5 ప్రభాతవార్త:** కేంద్ర యువ జన సర్వీసులు, క్రీడాశాఖ, మైభారత్ సంయుక్త ఆధ్వ ర్యంలో స్థానిక ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్‌లో భాగంగా జరిగిన యూత్ పార్లమెంట్ పోటీలు ఘనంగా నిర్వహించారు. గురువారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమరాల్డ్స్ కళాశాల ఉపసంచాలకులు మునిరత్నం, మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్స్ డాక్టర్ లలిత, డాక్టర్ మాధవి, మైభారత్ ప్రతినిధి బాబురెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ప్రతిభ చూపిన 10 విద్యార్థులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ప్రతి నెల హెమటాలజీ నిపుణుడు సేవలు



**తిరుపతి హెల్త్, మార్చి 5 ప్రభాతవార్త:** తిరుపతి వాసులకు యశోద హాస్పిటల్స్ ప్రముఖ హెమటాలజీ నిపుణుడు డా.కరణం అశోక్ కుమార్ సేవలు అందుబాటులోకి రానున్నాయని కే.ఆర్ హాస్పిటల్ అధినేత, జనరల్ సర్జన్ డా. కాపిరెడ్డి రమేష్ రెడ్డి తెలిపారు. ప్రతినెల మొదటి గురువారం తిరుపతిలోని కే.ఆర్ హాస్పిటల్‌లో ఆయన రోగులను పరిశీలిస్తారని చెప్పారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా డా. కరణం అశోక్ కుమార్ మాట్లాడుతూ తాను ఈ ప్రాంతానికి చెందినవాడినని, సొంత ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రతినెల తిరుపతికి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సి. శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, సెంటర్ ఇన్‌చార్జ్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



**పాకాల, మార్చి 5 ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామల చెరువు నందు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతమ్మ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు పాఠశాల వార్షికోత్సవం ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యా శాఖాధికారి బాబ్జి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రేమ, గురువుల ఆశీస్సులు విద్యార్థుల విజయంలో కీలకం అని, కనిపించే దేవుళ్లే తల్లితండ్రులు, గురువులు అని పేర్కొన్నారు. తదుపరి స్కూల్ డే సందర్భంగా నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మరియు సైన్స్ డే విజేతలకు ప్రశంస పత్రాలతో పాటు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ రెడ్డి, పూర్వ విద్యార్థుల

## రెవెన్యూ కార్యాలయం పని తీరుపై పార్టీకి ఫిర్యాదు

తొట్టంబేడు,మార్చి 5 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండల రెవెన్యూ కార్యాలయం పని తీరుపై రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు ఫిర్యాదు చేసారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు లోకేష్, పార్టీ అధ్యక్షునికి రాతమూలకంగా ఫిర్యాదు చేసారు. గతంలో ఇక్కడ పని చేసిన డెప్యూటీతహశీల్దార్ సర్వే నెంబర్ 107లో భూమికి యాజమాన్యహక్కు పత్రం జారి చేసి వైకాపాకు తమ స్వామి భక్తిని ప్రదర్శించుకున్నారని పార్టీ నాయకులకు వివరించారు. ఈ మేరకు బాలసుబ్రమణ్యం,బి.వెంకటేశ్వర్లు నాయకులను కలసి ఫిర్యాదు చేసారు.

# తిరుపతి డివిజన్

## బార్ అసోసియేషన్ సభ్యులు రెన్యువల్ చేసుకోండి

**తిరుపతి, మార్చి 5 ప్రభాతవార్త:** తిరుపతి బార్ అసోసియేషన్ సభ్యులు తమ సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవాల్సిందిగా తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టి రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి వి.విద్యానాథరెడ్డి సంయుక్తంగా తెలిపారు. 2025–26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక చందాను మార్చి 8 లోపు తప్పని సరిగా చెల్లించి సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సర్కులర్ ప్రకారం సభ్యులందరూ సహకరించి బార్ అసోసియేషన్ కార్యాచరణను విజయవంతం చేయాలని వారు కోరారు.

## బాల్య వివాహాలను అరికట్టడండి



**విజయపురం, మార్చి 5 ప్రభాతవార్త:** మండలంలోని శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు శ్యామల బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యంలోనే వివాహం చేసుకున్న అమ్మాయిలకు విద్యతో పాటు భవిష్యత్ కేరియర్ అవకాశాలు అందుబాటులో ఉండవని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో విద్యార్థులు 1098ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు



**కేవీబీ పురం, మార్చి 5 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కేవీబీ పురం ఉన్నత పాఠశాల, ఏపీఎంఎస్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షల్లో సత్తా చాటడం జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రపంచ స్థాయి పోటీలకు అలాగే వారిలోని ప్రతిభను వెలికితీస్తూ ఉన్నత చదువులు చదవడానికి దోహదపడేలా చేస్తుందని మండల విద్యాశాఖ అధికారి రవికుమార్ తెలిపారు. ఈ యొక్క మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో కేవీబీ పురం మండలానికి సంబంధించి 16 మంది విద్యార్థులు అర్హులైనట్లు మండల విద్యాశాఖ అధికారి రవికుమార్ వెల్లడించారు. ఇంత మంది విద్యార్థులు అర్హులై వారి వెనుక నుంచి ప్రోత్సహించిన కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూనాటి సురేష్, అంజూరు హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు వెంకట కృష్ణయ్య, రవిచంద్ర, అలాగే ఉపాధాఉ్యయులు కృషిని అభినందించారు.ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో సత్తా చాటిన ప్రతి ఒక విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి ఆర్.రవికుమార్ ప్రతి ఒక్క విద్యార్థులను అభినందనలు తెలిపారు.

## అవినీతిపై సమగ్ర విచారణ జరపండి : సీపీఎం

***కేవీబీ పురం, మార్చి 5 ప్రభాతవార్త:*** కేవీబీ పురం మండలంలోని వగత్తూరు గ్రామంలో డ్వాక్రా సంఘాల్లో 30 లక్షల రూపాయల అక్రమాలు జరిగినట్లు సంఘాల మహిళలు ఆరోపిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్ తెలిపారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ గురువారం ఏపీఎం ఇందిర డ్వాక్రా సభ్యుల చేత వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ దళితులు కోల్పోయిన లక్షలాది రూపాయలను తక్షణమే రికవరీ చేయాలని కోరారు. కావేరి సంఘం సభ్యులు కేవీబీ పురంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో నాలుగు లక్షల 36 వేలు అప్పు ఉన్నప్పటికీ మేనేజర్ చేత నో డ్యూస్ సర్టిఫికెట్ ఇప్పించి నిబంధనలకు విరుద్ధంగా రాజుల కండ్రిగ లోనే ఎస్‌బీఐ బ్యాంకులో రుణాలు ఇప్పించడం, కేవీబీ పురం బ్యాంకులో చెల్లించాల్సిన అప్పులను సభ్యుల నుంచివసూలుచేసి కాజేశారని మండిపడ్డారువగత్తూరు గ్రామస్తులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాలకు అండగా నిలవండి





**తిరుపతి,మార్చి 5ప్రభాతవార్త:** బంగారు కుటుంబాలకు మార్గదర్శులు అండగా నిలవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య పిలుపునిచ్చారు. నగరంలోని బంగారు కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మార్చేందుకు మార్గదర్శులు ముందుకు వచ్చి అండగా నిలవాలని ఆమె కోరారు. గురువారం జీవకోనలోని విశ్వం పాఠశాలలో నగరపాలక సంస్థ, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సంయుక్తంగా జాబ్ మేళాను నిర్వహించారు. నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అందులో భాగంగానే ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సహకారంతో జాబ్ మేళా నిర్వహించామని తెలిపారు. ఈ మేళా కు సుమారు 300మంది హాజరు కాగా అందులో 200 మంది బంగారు కుటుంబాల వారు ఉన్నారని తెలిపారు. 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉన్న వారికి పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ శారదా దేవి, ప్రయివేట్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి,, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, రెవిన్యూ అధికారి రవి, సచివాలయం కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిని కోల్పోకుండా చూడండి

–సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



**తిరుపతి,మార్చి 5ప్రభాతవార్త:** ఇంటింటికి పారిశ్రామి కవేత్తలను చేయడమే తన లక్ష్యంగా ప్రకటించుకుం టున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి 562 రోజులుగా తిరుపతిలో రిలే దీక్షలు చేస్తున్న 32 కుటుంబాల చిరు వ్యాపారుల రోదన ఎందుకు వినపడలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ప్రశ్నించారు. గురువారం టిటిడి పరిపాలన భవనం వద్ద శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు 562 రోజులుగా సాగిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని ఆయ న సందర్శించారు.అలిపిరి మార్గంలో అన్ని రకాల వ్యాపారాలు సవ్యంగా సాగుతున్నాయని,అదనంగా అటవీ విభాగం వారు తెరిచిన కొత్త షాపులు కూడా ఉన్నాయని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, జిల్లా అధ్యక్షుడు ఎస్ జయచంద్ర, శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మధు, చిట్టిబాబు, యుగంధర్, చిరంజీవి, ప్రకాష్, నర్సింహులు, రాంబాబు, కృష్ణమూర్తి, రాజశేఖర్ మునెయ్య పాల్గొన్నారు.

## ట్రాక్టర్, బస్సు ఢీ - తప్పిన పెను ప్రమాదం



**పుత్తూరు రూరల్, మార్చి 5 ప్రభాతవార్త:** పుత్తూరు మండలం వేపగుంట వద్ద జాతీయ రహదారిపై ట్రాక్టర్, బస్సు ఢీకొన్న సంఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తాపడగా, బస్సు ముందు భాగం పూర్తిగా ఛిద్రమైంది. అయితే అదృష్టవశాత్తు బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు, ట్రాక్టర్ డ్రైవర్ పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం చెన్నై నుంచి తిరుపతికి ప్రయాణికులతో వెళుతున్న తమిళనాడు బస్సు ముందుగా వెళుతున్న ట్రాక్టర్‌ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఢీకొంది. దీంతో ట్రాక్టర్ రోడ్డుపై బోల్తా పడింది. బస్సు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. అయితే ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గాయాలపాలైన ట్రాక్టర్ డ్రైవర్‌ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా మహోత్సవాలు

– కళ్యాణోత్సవం, ఉత్సవమూర్తుల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణ



**పులిచెర్ల, మార్చి 5 ప్రభాతవార్త:** పులిచెర్ల మండలం వి.సి.వడ్డిపల్లి (వెదర్ల చెరువు వడ్డిపల్లి) గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వినాయకస్వామి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాల మహా కుంభాభిషేక మహోత్సవాలు భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణ పుణ్యకాలంలో ఫాల్గుణ మాసం బహుళ పంచమి సందర్భంగా ఈ కార్యక్రమా లను గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చుట్టుపక్కల గ్రామ ప్రజలు విచ్చేసి మహాకుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు.


కెనరా బ్యాంక్ Canara Bank Together we can — పుత్తూరు శాఖ (6610), పుత్తూరు ఫోన్: 8330938031, 9482700500

**బంగారు నగల వేలం ప్రకటన**

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినసూ బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. 12.03.2026 వ తేది లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో తేది:13.03.2026 సా.4.00గం॥లకు లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

| వ. నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం ఛార్జీలతో రూ. |
|---|---|---|---|---|
| 1 | 180207743640 | కాకర్ల జయశంకర్, ఇం.నెం.17/237/బి. బి.డి. కాలనీ, పుత్తూరు, చిత్తూరు జిల్లా –517583 | 21.600 | 1,05,720.30 |

పుత్తూరు, తేది:05.03.2026 సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

## సత్యవేడు వైసీపీ పరిశీలకులుగా దబ్బల శ్రీమంత్‌రెడ్డి



సూళ్లూరుపేట, మార్చి 5 ప్రభాతవార్త: మున్సిపల్ ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డిని సత్యవేడు నియోజకవర్గ వైసీపీ పరిశీలకులుగా ఆ పార్టీ అధిష్టానం గురువారం ప్రకటించింది. దివంగత నేత దబ్బల రాజారెడ్డి తనయుడిగా జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడుగా ఉన్న దబ్బల శ్రీమంత్‌రెడ్డిని పార్టీ పరిశీలకులుగా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా దబ్బల శ్రీమంత్‌రెడ్డి మాట్లాడుతూ సత్యవేడు నియోజక వర్గంలో పార్టీ పటిష్టత కోసం పనిచేస్తానని, 2029 ఎన్నికల్లో సత్యవేడు నియోజక వర్గంలో వైసీపీ అభ్యర్థిని విజయపథంలో తీసుకొచ్చి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు శ్రమిస్తానని తెలిపారు.

## దొంగతనాలపై ముందస్తు జాగ్రత్తలు : సీఐ



నాయుడుపేట, మార్చి 5 ప్రభాతవార్త: నాయుడుపేట అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు గురువారం నాయుడుపేట బస్టాండ్ నందు మహిళా ప్రయాణికులకు దొంగతనాలు, సైబర్ నేరాలు, చైన్ స్నాకింగ్, పై అవగాహన కల్పిస్తూ ముందస్తు జాగ్రత్తలు ఏ విధంగా తీసుకోవాలో వారికి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణించేటప్పుడు దొంగతనం జరిగిన తర్వాత బాధపడడం కన్నా ముందస్తు చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకున్నప్పుడు పూర్తిగా నేరాలు నియంత్రించొచ్చు అని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వర్లు వారి సిబ్బంది పాల్గొన్నారు.

## అల్లు శిరీష్ వివాహ వేడుకల్లో హరీష్ బాబు



వాకాడు, మార్చి 5 ప్రభాతవార్త: ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ కుమారుడు హీరో అల్లు శిరీష్ వివాహ వేడుకల్లో వాకాడు మండలం టిడిపి నేత, ప్రముఖ వ్యాపారవేత కల్లూరు హరీష్‌బాబు నాయుడు వేడుకల్లో పాల్గొన్నారు. ప్రముఖ నిర్మాత ముత్తంశెట్టి బ్రదర్స్‌తో ప్రత్యేక అనుబంధం ఉండడంతో పెళ్లి వేడుకల్లో అల్లు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో ప్రముఖులతో హరీష్ బాబు నాయుడు కలిసి వధూవరులను ఆశీర్వదించారన్నారు.

## నేడు దివ్యాంగులకు పరికరాల పంపిణి

వాకాడు, మార్చి 5 ప్రభాతవార్త: మండలంలోని దివ్యాంగులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పరికరాల పంపిణీ కార్యక్రమంపై ఈ నెల 6వ తేది శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు సమావేశం డిప్యూటీ ఎంపీడీవో దేవదానం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలోని మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయం సిబ్బంది, ఏపిఓ, వెలుగు ఏపిఎం, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, పంచాయితీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు, మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు కూడా పాల్గొనాలని సూచించారు.

## అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం



బాలాయపల్లి, మార్చి 5 ప్రభాతవార్త: మండలం పెరిమిడి గ్రామంలో వెలసియున్న శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో 84వ ఆనంద అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయం విద్యుత్ దీపాలంకరణతో దేదీప్యమానంగా వెలుగొందింది. వేలాది మంది భక్తులు తరలివచ్చి పాండురంగ స్వామి, శ్రీ రుక్మిణి అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం అందజేశారు.

## స్కాలర్‌షిప్స్ ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు



వెంకటగిరి, మార్చి 5 ప్రభాతవార్త: విద్యా రంగంలో మరో విశిష్ట విజయాన్ని నమోదు చేస్తూ 2025-26 విద్యా సంవత్సరానికి నేషనల్ మీన్స్ కమ్‌మెరిట్ స్కాలర్‌షిప్ నిర్వహించిన పరీక్షల్లో వెంకటగిరి ఏపీ మోడల్ స్కూల్ 10 మంది విద్యార్థినీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఆర్థిక సహాయం పొందడానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి.తులసి జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు మల్లెల హితీషా షార్లీ రాజ్, చినకొండ వినూత్న రెడ్డి, జీ.బి. జ్యోష్ణ, ఏ. హవిషా, మామిడి జయంత్ కుమార్, చింతల సుజిత్ కుమార్, ఏనమల భావన్, పొట్ట ముని వర్షిత, పొలూరు ధనుప్రియ, ఎస్. శివ కార్తిక అర్హత సాధించిన వారిలో వున్నారు. పాఠశాల్లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో టి.జి.టి మ్యాథ్స్ శ్రీమతి ఐ. వినీలా, టి.జి.టి సైన్స్ కళావాణి, టి.జి.టి సోషల్ వి. శ్రీకాంత్, పి.జి.టి ఫిజిక్స్ కె.విజయలక్ష్మి, పి.జి.టి కెమిస్ట్రీ ఈ. కిషోర్, అలాగే పి.జి.టి కామర్స్ ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. సమగ్రంగా శిక్షణ ఇచ్చి, నిరంతర పర్యవేక్షణతో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు తోడ్పడ్డారని ఆమె చెప్పారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## మహిళా సాధికారత తోనే అభివృద్ధి సాధ్యం : ఎస్సై



బాలాయపల్లి, మార్చి 5 ప్రభాతవార్త: మహిళా సాధికారతతోనే సమాజం అభివృద్ధి సాధిస్తుందని బాలాయపల్లి ఎస్సై కామినేని గోపి అన్నారు. మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు, సిబ్బందికి బాలయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లియోనా వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆటవిడుపుగా వారికి మ్యూజికల్ చైర్స్, ఇంకా పలు ఆటలు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు. బాలికలను నూరు శాతం చదివించి వారి భవిష్యత్తుకు తల్లిదండ్రులు బంగారు బాటలు వేయాలని సిడిపిఓ శంషాద్ బేగం కోరారు. వైద్యాధికారి డాక్టర్ లియోనా మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే దేశం అభివృద్ధి సాదిస్తుందని అన్నారు. మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యాధునిక వైద్యం అందిస్తున్నాయన్నారు. ఈ వైద్య పరీక్షల్లో సిహెచ్ఓ నీరజ, సూపర్వైజర్ రాజేశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు, సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయశాఖ మంత్రిని కలిసిన ఏఎంసి ఛైర్మన్



వెంకటగిరి, మార్చ్ 5 ప్రభాతవార్త: వ్యవసాయ శాఖ మంత్రి అచ్చమనాయుడుని ఏఎంసీ ఛైర్మన్ పునుగొటి విశ్వనాథం కలిసి సత్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని మంత్రిని కోరారు. రైతుల కోసం గోదాముల నిర్మాణానికి, ఇంకా పలు సమస్యలను మంత్రి దృష్టికి నేమ్స్ ఛైర్మన్ తీసుకొని వెళ్లారు. సానుకూలంగా మంత్రి స్పందించినట్లు ఏఎంసి ఛైర్మన్ విశ్వనాథం తెలిపారు.

## 9న మెగా జాబ్ మేళా

వెంకటగిరి, మార్చి 5 ప్రభాతవార్త: ఈ నెల 9వ తేదీ విశ్వదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. పలు పరిశ్రమలలో ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని చెప్పారు. పరులైన వారందరూ దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో జాబ్ మేడం జరుగుతున్నట్లు చెప్పారు.

## త్వరలో యూనివర్సిటీగా శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల




తిరుపతి విద్య మార్చి 5 ప్రభాతవార్త: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలనే చేధించాలంటే ప్రతిభను ఆయుధంగా చేసుకుని కృషి చేయాలని వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన తరంగ్2026 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోనే ప్రతిభఉన్నత లక్ష్యాన్ని చేరుస్తుందని, ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక గొప్ప టాలెంట్ దాగి ఉంటుందని, సమయాను సందర్భంగా టాలెంట్ ఉపయోగ పడినప్పుడు ఆ విద్యార్థి జీవితాన్ని గొప్ప స్థాయికి చేరుస్తుందన్నారు. శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల గడిచిన కాలంలో దేశం గర్వపడే విధంగా విద్యార్థులను తయారుచేసి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోందన్నారు. కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఒక మంచి ఆశయాన్ని ఎంచుకొని దాని సాధన కోసం కృషి చేయాలని, సమాజంలో కీర్తింపబడే స్థాయికి ప్రతి విద్యార్థి చేరుకోవాలని కోరారు. అనంతరం 2025-26 అకడమిక్ ఇయర్‌లో పలు కోర్సులలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి, జీసీసీ హెడ్ రవిచంద్రన్ దొరైరాజన్, వెంకట్రామిరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ప్లే బ్యాక్ సింగర్స్ లిప్సిక భాష్యం, ఓంకార్ రాచమల్ల వారి సంగీత గానంతో విద్యార్థులను ఉర్రూతలూగించారు.

## ముమ్మరంగా జనసేన పార్టీ సభ్యత్వ నమోదు



సూళ్లూరుపేట, మార్చి 5 ప్రభాతవార్త: జనసేన పార్టీ ఆదేశాల మేరకు సూళ్లూరుపేటలో ఆ పార్టీ నాయకులు ప్రత్యేకంగా శిబిరాన్ని ఏర్పాటు చేసి గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. జనసేన పార్టీ నాయకులు మాబాషా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఎపి టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ నాయకులు ఆవుల రమణ, హరిబాబు, శంకు సురేష్, కోట యాదవ్, ఆవుల దాస్, హరి, ప్రవీణ్, పద్మజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## రామ్మోహన్‌రావుకు ఘన నివాళి



సూళ్లూరుపేట, మార్చి 5 ప్రభాతవార్త: నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకులు, దివంగత పి.రామ్మోహన్‌రావు 21వ వర్ధంతిని స్థానిక ఆర్టీసీ డిపో వద్ద గురువారం నిర్వహించారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ ఎం.శేఖర్ మాట్లాడుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఆర్టీసీ కార్మికుల కోసం వారి సమస్యలు పరిష్కరించేందుకు అహర్నిశలు శ్రమించిన రామ్మోహన్‌రావును ప్రతి ఒక్క ఆర్టీసీ కార్మికుడు గుర్తు పెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, షాజహాన్, పోలయ్య, సుబ్రహ్మణ్యం, భాస్కర్, రమణయ్య, శంకరయ్య, వెంకటయ్య, రాధయ్య, అశోక్, రాములు, జమాల్, రఫీ, హరీష్, చెంగయ్య, మాధవ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి రూరల్ సిఐగా ఇబ్రహీం



శ్రీకాళహస్తి రూరల్, మార్చి 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి రూరల్ పోలీసు స్టేషన్‌కు నూతన సిఐగా జి.ఇబ్రహీం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలపట్ల మండల ప్రజలు సహకరించాలన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేసుకోవచ్చునన్నారు. రూరల్ సిఐగా పనిచేస్తున్న నాగరాజు శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. టూ టౌన్ స్టేషన్‌ల్లో పనిచేస్తున్న నాగార్జున రెడ్డి విఆర్‌కు వెళ్ళినట్లు సమచారం.

## కల్వకుంట్ల కవితకు ఘన స్వాగతం






రేణిగుంట, మార్చి 5 ప్రభాతవార్త: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు రేణిగుంట విమానాశ్రయంలో గురువారం ఘన స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం రేణిగుంట చేరుకున్న ఆమెకు విమానాశ్రయంలో ఆమె అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి శాలువలు కప్పి పుష్పగుచ్ఛాలు ఇచ్చి తమ అభిమానాన్ని దాటుకున్నారు. శ్రీకాళహస్తి వైసిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి శ్రీ పవిత్ర రెడ్డి, కుమారుడు బియ్యపు ఆకర్షరెడ్డి విమానాశ్రయంలో కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో కొత్త పార్టీ పెడతామన్నారు. ఎప్పుడు పెడతామన్నది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. తరువాత అందరితో కలిసి రోడ్డు మార్గంలో తిరుపతి బయలుదేరి వెళ్లారు.

## రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్,ఎస్పీ



గంగవరం,మార్చి 5 ప్రభాతవార్త : ఈ నెల 04న గంగవరం మండలం దండపల్లె కూడని సమీపంలోని బెంగళూరు చెన్నై జాతీయ రహదారిపై లారీని కారు ఢీకొన్న ప్రమాద స్థలాన్ని గురువారం జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్,జిల్లా ఎస్పీ తుషార్ డూడిలు పరిశీలించారు.రోడ్డు ప్రమాదంలో కర్నాటక రాష్ట్రానికి చెందిన 5 మంది మృతి చెందడం విదితమే..ఈ మేరకు జిల్లా కలెక్టర్,ఎస్పీలు సంఘటన స్థలాని గురువారం పరిశీలించారు.స్థానిక అధికారుల తో ప్రమాదం జరిగిన తీరు మరియు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.అనంతరం జాతీయ రహదారుల శాఖ అధికారులతో వారు మాట్లాడుతూ.. జిల్లాలో జాతీయ రహదారులపై జరుగుతున్న రహదారి ప్రమాదాలను పూర్తి స్థాయిలో నివారించేందుకు చర్యలు తీసుకోవాలని,తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించిన ప్రమాద ప్రాంతాలలో తక్షణ భద్రతా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలకు ప్రధాన కారణాలైన అతివేగం,రాంగ్‌రూట్ ప్రయాణలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రారంతాలను గుర్తించి ఆ ప్రాంతాలలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.జాతీయ రహదారిపై ప్రమాదులు జరిగే ప్రాంతాలలో ప్రమాద సూచిక బోర్డులు, వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.ఇలాంటి ప్రమాదాలు పునరావృతంకాకుండా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.

## వీఆర్‌వో ఏకపక్ష ధోరణిపై గ్రామస్తులు ఆగ్రహం



నాగలాపురం, మార్చి 5 ప్రభాతవార్త: నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లి సచివాలయ వీఆర్‌వో చంద్రశేఖర్ అవలంబిస్తున్న ఏకపక్ష ధోరణిపై కస్తూరినాయుడు కండ్రిగ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కూటమి నేతల ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. ఆ గ్రామంలోని కూటమి నేతల ఆధ్వర్యంలో గ్రామస్తులు సచివాలయాన్ని చేరుకుని వీఆర్‌వో చంద్రశేఖర్‌ని నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌వో చంద్రశేఖర్ గత వైసీపీ ప్రభుత్వంలో వీఆర్‌వోగా విధులు చేపట్టారు. అప్పటి నుంచి ఆయన ఆ గ్రామంలోని వైసీపీ నేతలు చెప్పిందే వేదంగా భావిస్తూ వాళ్ళ కనుసన్నల్లోనే మెలుగుతూ వాళ్ళకే పనులు చేసిపెడుతున్నారని మండి పడ్డారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఆ గ్రామంలోని ఓ వైసీపీ నేత ఆజ్ఞ లేనిదే ఆయన పనులు ముట్టడం లేదని ఆరోపించారు. అలాగే జగనన్న కాలనీలోని ఇంటి స్థలాలను కూడా వీఆర్‌వో చంద్రశేఖర్ అక్కడి వైసీపీ నేతతో కుమ్మకై పక్క గ్రామాల వారికి, తమిళనాడు వాసులకి అమ్మేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై వీఆర్‌వో, చంద్రశేఖర్‌ని స్థానిక కూటమి నేతలు నిలదీశారు. దీనిపై కలెక్టర్‌కి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ నిరసనలో సురుటుపల్లి పంచాయితీ గ్రామ అధ్యక్షుడు మురళి, నాయకులు రుద్రయ్య, మనోజ్‌కుమార్, హరినాథ్‌రెడ్డి, నాగలాపురం మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు యమునమ్మ, గ్రామస్తులు మోహన్, వరుణ్‌కుమార్, రేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

## పురమిత్ర పిర్యాదుల పరిశీలన

**-నగరపాలక కమిషనర్ మౌర్య**



తిరుపతి,మార్చి 5ప్రభాతవార్త: ప్రజా పిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ .మౌర్య అధికారులను ఆదేశించారు. పురమిత్ర యాప్ ద్వారా ప్రజల నుండి వచ్చిన పిర్యాదులను అధికారులతో కలసి గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పిర్యాదులు అందిన వెంటనే ఆయా వార్డు అధికారులు పిర్యాదుదారుడితో కలసి పరిశీలించి సమస్య పరిష్కరించాలని నిర్దేశించారు. పరిష్కారం కాని వాటిని ఉన్నతధికారుల దృష్టికి తీసుకువస్తే సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెత్త కుప్పలు తొలగించాలని, కాలువల్లో చెత్త తియ్యాలని, డ్రైనేజి కాలువలు వేయాలని, సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారని వాటిని పరిశీలించామని, ప్రణాళికంగా పరిష్కరిస్తామని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, రెవిన్యూ అధికారి సేతుమాదవ్, డి.ఈ.లు లలిత, శిల్ప, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, తదితరులు ఉన్నారు.

## ఘనంగా 8వ జన్ ఔషధీ దివస్-2026



శ్రీకాళహస్తి, మార్చి 5 ప్రభాతవార్త: ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రం ఆధ్వర్యంలో 8వ జన్ ఔషధీ దివస్-2026 కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత మెడికల్ హెల్త్ చెక్ అప్ శిబిరాన్ని నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధి, ఏడు గంగమ్మ గుడి పక్కన ఉన్న ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ కె.వెంకట భాస్కర్, ఎంబిబిఎస్, ఎండీ, జనరల్ సర్జన్ సీనియర్ మెడికల్ ఆఫీసర్, బీడబ్ల్యూఎఫ్ డిస్పెన్సరీ, శ్రీకాళహస్తి వారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రాల ద్వారా సుమారు 70 శాతం వరకు మందుల ధరలు తగ్గి ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమా నికి ఉమ్మడి చిత్తూరు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు చంద్రప్ప, ఏపీ ఫార్మా కౌన్సిల్ సభ్యుడు రాము, శ్రీకాళహస్తి మెడికల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్ రావు, ఉపాధ్యక్షుడు చక్రపాణి, ఫార్మసిస్ట్ అరుణ,షాప్ ఓనర్ డా.సూర్య తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు ప్రత్యేక అధికారులు!

**- గ్రామ పంచాయతీలకు ఇప్పట్లో ఎన్నికలు లేనట్లే**



చిత్తూరు, మార్చి 5 ప్రభాతవార్త: గ్రామ పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనకు సిద్ధం అవుతున్నాయి. జిల్లాలోని గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు ఏప్రిల్ 2వ తేదీ నాటికి గడువు ముగియనుంది. ఇప్పటికిప్పుడు గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడానికి ఇటు ప్రభుత్వం, అటు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా లేకపోవడంతో గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి కాలం ముగిసిన వెంటనే వీటికి స్పెషల్ ఆఫీసర్లను నియమించి పాలన సాగించడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వెయ్యికి పైగా గ్రామ పంచాయతీలు వుండగా నూతనంగా ఏర్పడిన చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం 697 గ్రామ పంచాయతీలు వున్నాయి. ఈ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులకు ఏప్రిల్ 2వ తేదీ నాటికి పదవికాలం ముగియనుంది. స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాల్టీల పాలకవర్గాల గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆరు నెలలకు ముందే కసరత్తు ప్రారంభించింది. జిల్లాలో మున్సిపల్ పాలకవర్గాలకు మార్చి 17వ తేదీ పదవి కాలం ముగియనుండగా, గ్రామ పంచాయతీలకు ఏప్రిల్ 2వ తేదీ పదవికాలం ముగియనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పట్లో పదవికాలం ముగుస్తున్న మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా లేదు. జన గణన, బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు మార్చి 17వ తేదీ ముగియనున్న మున్సిపల్ పాలకవర్గాల స్థానంలో స్పెషల్ ఆఫీసర్లు నియమించి కొద్దికాలం పాటు పాలన సాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అలాగే గ్రామ పంచాయతీలకు సైతం స్పెషల్ ఆఫీసర్లను నియమించి ఆరు నెలల అనంతరం అప్పటి పరిస్థితులను అనుసరించి ఎన్నికలకు వెళ్ళాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కార్యాలయం ప్రారంభం



తవణంపల్లె, మార్చి 5 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్దగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కార్యాలయంను గురువారం ఘనంగా ప్రారంభించారు. గత నెల 6న దేవస్థానం నూతన పాలక మండలి పదవీ ప్రమాణ స్వీకారం చేసిన విషయం విధితమే. దీనితో పాలకమండలి ఛైర్మన్ కార్యాలయంను ఆలయ ఈఓ కార్యాలయం పక్కన నూతనంగా ఏర్పాటు చేశారు. అన్ని హంగులతో ఏర్పాటు చేసిన కార్యాలయంను దేవస్థానం ఛైర్మన్ ఎ.రఘుపతి ఆధ్వర్యంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వర చౌదరి, మండల టీడీపీ నాయకులు కొండ్రాజుకాల్వ సర్పంచ్ దొడ్ల పరందామనాయుడు దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ప్రారంబించారు. ఈసందర్భంగా భక్తులకు అందుబాటులో వుండేందుకే ఛైర్మన్ కార్యాలయంను ప్రారంభించినట్లు ఛైర్మన్ రఘుపతి తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.రఘుపతి పంపతులు, ఈఓ ఇ.మునిశేఖర్, అరగొండ సింగిల్‌విండో అధ్యక్షుడు ఎ,రంజిత్‌రెడ్డి, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ చౌదరి, పాలకమండలి సభ్యులు, ఆలయ అర్చకులు, మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మకు వేలం పాటల ద్వారా రూ. 3.08కోట్ల ఆదాయం



బోయకొండ(చౌడేపల్లి), మార్చి 5 ప్రభాతవార్త: శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం వివిధ వనరులకు నిర్వహించిన వేలం పాటలో రూ. 3,08,61,000లు ఆదాయంగా సమకూరినట్లు ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం తెలిపారు. కొండపై కార్యాలయంలో సంవత్సర కాలం పాటు జరిగిన వేలం పాటలో కొబ్బరి చిప్పలు సేకరించుకొనే హక్కును హరిప్రసాద్ రూ. 54.70లక్షలు హెచ్చుగా పాడి దక్కించుకొన్నారు. తలనీలాలు సేకరించుకొనే హక్కును యాదగిరి రూ. 27.15లక్షలు, పెద్దభోగం, చిన్నభోగం సేకరించుకొనే హక్కును గోపి రూ. 88.20లక్షలు, టోల్గేట్ నిర్వహించుకొనే హక్కును రమణ రూ. 73లక్షలు 18శాతం జీఎస్టీ, చీరలు, రవికలు సేకరించుకొనే హక్కును గంగులప్ప రూ. 47.06లక్షలు, మొబైల్‌ఫోన్‌లు, లగేజీ భద్రపరచుకొనే హక్కును కిరణ్ రూ. 18.50లక్షలు హెచ్చుగా పాడి దక్కించుకొన్నారన్నారు. చిత్తూరు జిల్లా దేవాదాయ ధర్మాదాయశాఖ ఎసి చిట్టెమ్మ, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.